క్లుప్తంగా

బెల్లం తయారీ కేంద్రం తనిఖీ



బెల్లం తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఫుడ్ఇన్‌స్పెక్టర్ రవికుమార్

రావికమతం: మండలంలో గుడివాడ పంచాయతీ మట్టవానిపాలెంలో బెల్లం తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఫుడ్ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తనిఖీ చేశారు. శేషుబాబు బెల్లం తయారీ కేంద్రంలో హానికరమైన నిషేధిత రసాయక పదార్థాలు, రంగులు ఉపయోగిస్తున్నట్టు కలెక్టర్ దృష్టికి వెళ్లింది. కలెక్టర్ ఆదేశాల మేరకు కేంద్రంలో తనిఖీలు నిర్వహించి, శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపినట్టు రవికుమార్ తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన



మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మాట్లాడుతున్న మహాలక్ష్మీనాయుడు

మాడుగుల రూరల్: హెచ్ఐవీ బారిన పడకుండా ప్రజలు తగిన ఆరోగ్య జాగ్రతలు తీసుకోవాలని తుమ్మపాల ఎస్‌వీడీఎస్ ఏపీ ఎస్ఏసీఎస్ ప్రాజెక్టు మేనేజర్ కె.మహాలక్ష్మినాయుడు తెలిపారు. జాతీయ ఎయిడ్స్ నిర్మూలన సంస్థ ఆదేశాల మేరకు సమగ్ర ఆరోగ్య ప్రచార రథం ద్వారా శుక్రవారం పలు గ్రామాల్లో అవగాహన కల్పించారు. మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రి, జగ్గన్నచావిడి, నెయ్యిల వీధి, బాదం వీధితో పాటు కె.జె.పురం, వంటర్లపాలెం, వడ్డాది తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ కౌన్సెలర్ మరిడేష్, ల్యాబ్ టెక్నీషియన్ గోవింద, ఒఆర్ డబ్ల్యూ ఎం.కుమారి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

29న రోలుగుంట మండల సమావేశం

రోలుగుంట: ఈ నెల 29న రోలుగుంట మండల సమావేశాన్ని మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రావికమతం: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని, పుట్టిన అరగంట వ్యవధిలోనే తల్లిపాలను బిడ్డకు అందించాలని కొత్తకోట సెక్టార్ సూపర్‌వైజర్ గవహర్ ఉన్నిషా తెలిపారు. కొత్తకోట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పోషణ మాసోత్సవం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని చెప్పారు. రక్తహీనత బారిన పడకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాబూరావు

గొలుగొండ: గ్రామాలు పరిశుభ్రంగా ఉండే విధంగా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బాబూరావు తెలిపారు. గొలుగొండలో శుక్రవారం ఉదయం చెత్తను సేకరించే విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు.

చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారాలు చేసుకునే నిరుపేదలను ఇబ్బందులకు గురిచేయడం తగదని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ సూదికొండ మాణిక్యాలరావు అన్నారు. స్థానిక జీవీఎంసీ కార్యాలయ ఉద్యోగికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజుల్లో దసరా సమీపిస్తున్నా ఆ ఆనందం చిరువ్యాపారుల్లో లేదన్నారు. ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్న రాజకీయ నేతల కటౌట్లు, సెల్లార్లు వదిలి పెట్టకుండా వ్యాపారాలు చేస్తున్న పెద్ద వారిని వదిలి చిరువ్యాపారులను ఇబ్బందులు పెట్టడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వనమాల నాగభూషణం, కొల్లి చిన అప్పారావు, కొల్లి సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ‘డిజిటల్ బుక్’ పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ‘డిజిటల్ బుక్’పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

వంతెన కష్టాలు ఇంకెన్నాళ్లు?

- కృష్ణారాయుడిపేట-ఉగ్గినవలస మార్గంలో కుంగిన వంతెన
- మూడు నెలలుగా తిరగని ఆర్టీసీ బస్సులు
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రయాణికులు



కృష్ణారాయుడిపేట నుంచి ఆనందపురం వైపు నడుచుకుంటూ వెళుతున్న ప్రయాణికులు



కృష్ణారాయుడిపేట-ఉగ్గినవలస మార్గంలో కుంగిన రోడ్డు

కె.కోటపాడు : అనకాపల్లి, విజయనగరం, జిల్లాల సరిహద్దులో గల కృష్ణారాయుడుడిపేట-ఉగ్గినవలస వద్ద వంతెన బలహీనమై పలు చోట్ల కుంగిపోయింది. దీంతో ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలను ఈ ఏడాది జూన్ నెల నుంచి నిలిపివేశారు. వంతెన కుంగుతున్న విషయమై ఈ ఏడాది మే 27న కూలేందుకు సిద్ధంగా ఉన్న వంతెన శీర్షికతో సాక్షిలోకథనం ప్రచురితమైంది. దీంతో ఆర్టీసీ అధికారులు వంతెన పరిస్థితిని పరిశీలించి బస్సుల రాకపోకలు చేయడం కష్టతరంగా భావించి, నిలిపివేశారు. అప్పటి నుంచి ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. వంతెన విషయాన్ని అటు ప్రజాప్రతినిధులుగాని, అధికారులు గాని పట్టించుకోవడం లేదు. ఈ మార్గంలో ప్రతి రోజూ విశాఖపట్నం నుంచి కొత్తవలస, దేవాడ, ముషిరాం, లంకవానిపాలెం, కొరువాడ, ఆనందపురం గ్రామాల మీదుగా దేవరాపల్లికి ఆర్టీసీ బస్సుల రాకపోకలు సాగించేవి. వంతెన బలహీనంగా మారడంతో బస్సుల రాకపోకలను నిలిపివేశారు. దీంతో దేవరాపల్లి, కొరువాడ, డి.అగ్రహారం, ఆనందపురం తదితర గ్రామాలకు చెందిన వారు కొత్తవలస, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లేందుకు ఇక్కట్లకు గురవుతున్నారు. ఆటోలు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల్లో వ్యయప్రయాసలకోర్చి ప్రయాణించవలసి వస్తోంది.

ప్రజా ప్రతినిధుల స్పందనేది.. ?

కృష్ణారాయుడిపేట-ఉగ్గినవలస వంతెన మీదుగా అనకాపల్లి జిల్లా కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల ప్రజలతో పాటు విజయనగరం జిల్లా వేపాడ మండలాలకు చెందిన ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన బలహీనంగా మారి బస్సుల రాకపోకలు నిలిచిపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కె.కోటపాడులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో స్థానిక ప్రజా ప్రతినిధులు కుంగిన వంతెన సమస్యపై ఆర్అండ్‌బీ అధికారులను ప్రశ్నించారు. కృష్ణారాయుడిపేట-ఉగ్గినవలస వంతెన అడుగుభాగంలో జీవీఎంసీకి చెందిన రైవాడ కాలువ ప్రవాహం ఉన్న దృష్ట్యా ఈ వంతెనకు జీవీఎంసీ అధికారులు సుమారు రూ.80లక్షలు కేటాయించినట్టు ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. టెండర్ పనులు పూర్తయితే పనులు చేపట్టనున్నట్టు సమావేశంలో పేర్కొన్నారు. టెండర్ పనులు వేగవంతంగా పూర్తి చేసి వంతెన నిర్మాణాన్ని పటిష్టంగా జరపాలని పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు, వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి



కృష్ణారాయుడిపేట-ఉగ్గినవలస రోడ్డులో వంతెన కుంగిపోయి సుమారు ఐదు నెలలు కావస్తున్నా అధికారులు ఎటువంటి చర్యలను తీసుకోలేదు. భారీ వాహనాల రాకపోకలను నిలిపివేసి చేతులుదులిపేసుకున్నారు. విజయనగరం, కొత్తవలస ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించవలసి వస్తోంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు స్పందించి కొత్త వంతెన నిర్మించాలి.

– వేచలపు పైడంనాయుడు, డి.అగ్రహారం.

మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్



మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్



దేవరాపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి వనజ



కిత్తంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది



కె.సంతపాలెంలో మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మాదంనాయుడు

మాడుగుల: మహిళల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకాన్ని ప్రవేశ పెట్టిందని ఎంపీపీ తాళ్లపు రెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. మండలంలోని పొంగలిపాకలో నాయన సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి మహిళ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 246 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఉండూరు దేముడు, ఎంపీటీసీ మైచర్ల సన్యాసిరావు, ఉపసర్పంచ్ భాస్కరరావు, వైద్యాధికారులు సోముదొర, టి. శ్రీను, ఏఎస్ఎం మంగతల్లి, డి.ధనాజీ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీలు యమున, వసంత, అంగన్‌వాడీ కార్యకర్త వరలక్ష్మి పాల్గొన్నారు.

దేవరాపల్లిలో 223 మందికి వైద్య పరీక్షలు

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సచివాలయం-2లో నిర్వహించిన వైద్య శిబిరంలో దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.వనజ, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి గ్రీష్మ వైద్య సేవలందించారు. 223 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

కిత్తంపేటలో వైద్య శిబిరం

రావికమతం: స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొత్తకోట పీహెచ్‌సీ డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో కిత్తంపేటలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం మహిళల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సర్పంచ్ పెద్దిరెడ్ల రామలక్ష్మీనాయుడు,మాజీ సర్పంచ్ కర్రి అర్జున్ తదితరులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో సాలాపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

167 మంది మహిళలకు వైద్య పరీక్షలు

కె.కోటపాడు : స్వస్థ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మహిళలకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి మాదంనాయుడు అన్నారు. కె.సంతపాలెంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 167 మంది మహిళలకు వైద్య పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో జె.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మతిభ్రమించిన బాలకృష్ణను చట్టసభలకు రానీయకూడదు

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్

చోడవరం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై ఇష్టానుసారంగా అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే బాలకృష్ణకు మతిభ్రమించిందని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్ అన్నారు. చోడవరం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఎంతో మేలు చేసి, వారి హృదయాల్లో సుస్థిర స్థానం ఏర్పర్చుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి అనుచితంగా మాట్లాడిన, మతిస్థిమితం సరిగాలేని బాలకృష్ణను చట్టసభల్లోకి అడుగుపెట్టనీయకూడదన్నారు. అసెంబ్లీలో ఎవరిపై ఏమి మాట్లాడుతున్నారో బాలకృష్ణకే తెలియడంలేదని విమర్శించారు. ఎంతో హుందాగా రాజకీయాలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాలకృష్ణ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, డీఆర్‌యూసీ సభ్యుడు బొడ్డు శ్రీరామ్మూర్తి, పార్టీ నాయకులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గొయ్యి



నర్సీపట్నం మెయిన్ రోడ్డులో గుంత ఉందని తెలియడానికి స్థానికులు పెట్టిన కర్ర



తుని రోడ్డులో ఏర్పడిన గుంత

నర్సీపట్నం: నియోజకవర్గంలో రహదారుల అధ్వానంగా తయారయ్యాయి. అడుగడుగునా గోతులు పడడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. నర్సీపట్నం-తుని, కృష్ణదేవి పేట, చింతపల్లి, కోటవురట్ల, చోడవరం, విశాఖ రహదారుల్లో ప్రతి రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఈ రోడ్లపై ఎక్కడికక్కడ గుంతలు పడడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హడావుడిగా రూ.2 కోట్లతో ప్యాచ్‌వర్క్‌లు చేపట్టింది. ఈ పనుల్లో నాణ్యత లోపించింది. ఇటీవల కురిసిన వర్షాలకు ప్యాచ్‌వర్క్ వేసిన చోట తారు లేచిపోయి మళ్లీ గుంతలు పడ్డాయి. పరిసర ప్రాంతాల్లో వారు గుంతల్లో మట్టివేసి పూడుస్తున్నారు. వర్షాలకు నీరు చేరడంతో రాత్రివేళల్లో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే..



మాడుగుల మండలం సురవరం వద్ద ప్రధాన రహదారిపై గొయ్యి

మాడుగుల: మండలంలో ముకుందపురం నుంచి తాటిపర్తి వరకు గల ఆర్అండ్‌బీ రోడ్డు గోతులమయంగా మారడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని ప్రాణాలు గుప్పెటలో పెట్టుకుని వాహనచోదకులు ప్రయణిస్తున్నారు. పాడేరు నుంచి విశాఖ వెళ్లేందుకు ఈ రోడ్డే ప్రధాన రహదారి. నిత్యం రద్దీగా ఉండే ఈరోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు 30 గ్రామాల ప్రజలు మండల కేంద్రంతో పాటు చోడవరం, విశాఖ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ రోడ్డునే వినియోగిస్తారు. అడుగుకో గొయ్యి పడి అధ్వానంగా మారి, తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండల వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డుపై ఏర్పడిన గోతులు పూడ్చాలని పలు గ్రామాలు ప్రజలు కోరుతున్నారు.

తురకలపూడిలో తాగునీటికి అవస్థలు

విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో పనిచేయని మోటార్లు



బకెట్లతో నీరు మోస్తున్న సర్పంచ్ గోవింద



బోరు వద్ద అవస్థలు పడుతున్న గ్రామస్తులు

బుచ్చెయ్యపేట : మండలంలోని తురకలపూడిలో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారం రోజులుగా రెల్లివీధి,జగనన్న కాలనీల ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీరు సరఫరాకావడం లేదు. వారం రోజుల కిందట కురిసిన వర్షానికి పిడుగు పడి ట్రాన్స్‌ఫారం కాలిపోయింది. మూడు రోజుల క్రిందట ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేశారు. మోటార్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. రెండు కాలనీల్లో తాగునీరు సరఫరా చేసేందుకు మూడు మోటార్లు ఉన్నాయి. ఈ మోటార్లకు త్రీఫేజ్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో అవి పనిచేయక తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో దూర ప్రాంతాల్లో ఉన్న బోర్ల నుంచి నీటిని తెచ్చుకోవలసి వస్తోందని గ్రామస్తులు వాపోయారు. మోటార్లకు విద్యుత్ సరఫరా చేసి, తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మూడురోజుల కిందట కోరినా పట్టించుకోలేదని సర్పంచ్ గోవింద ఆరోపించారు. తాను దళిత సర్పంచ్‌ను కావడం వల్లే అధికారులు స్పందించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పై అధికారులు స్పందించి మోటార్లకు విద్యుత్ సదుపాయం కల్పించి, తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని సర్పంచ్, గ్రామస్తులు కోరుతున్నారు.

మహాలక్ష్మీ నమోస్తుతే..



చిలకవానిపాలెంలో మహాలక్ష్మి అవతారంలో దుర్గాదేవి



పాచిలవానిపాలెంలో నిర్వహించిన కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



ఎం. కోడూరు శివాలయంలో పార్వతీదేవికి పూజలు చేస్తున్న భక్తులు



చోద్యం గ్రామంలో నిర్వహించిన అన్నసమారాధన



నర్సీపట్నం దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి



మాడుగులలో వెలసిన దుర్గాపోలిపిల్లమ్మ



రోలుగుంటలో మహాలక్ష్మి అలంకరణలో ...



దేవీతల్లిని దర్శించుకుంటున్న భవానీ భక్తులు



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

నర్సీపట్నం: పట్టణంలో వెలసిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారి ఆలయం వద్ద కొనసాగుతున్న అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రసాదం స్వీకరించారు.

రోలుగుంట: స్థానిక పాత రామమందిరం వద్ద ప్రతిష్ఠించిన దుర్గమ్మను శుక్రవారం మహాలక్ష్మి స్వరూపంలో అలంకరించారు. అర్చకుడు రేజేటి చిట్టిబాబుచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మాడుగులలో...

మాడుగుల: మాడుగులలో వెలసిన దుర్గా పోలిపిల్లమ్మ శుక్రవారం మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నెల 29న మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఉత్సవ కమిటీ తెలిపింది. సివిల్ ఆర్టీసీ ఆటో యజమానులు, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక దేవీతల్లి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీనాదు శ్రీనివాసరావు, పరమేశ్వరి దంపతులతో పాటు భవానీ భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణలో ఏర్పాటు చేసిన కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మాడుగుల రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎం.కోడూరు శివాలయంలో పార్వతీ దేవిని, వంటర్లపాలెంలో కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన కుంకుమ పూజలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కె.జె.పురం కళావేదిక మీద అమ్మవారికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

రావికమతం: మండలంలోని చిలకవానిపాలెంలో దుర్గాదేవి అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. అర్చకులు గుంటూరు లక్ష్మణరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చోడవరం: మహాలక్ష్మి అలంకరణలో దుర్గాదేవి శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. వెంకన్నపాలెం కొండపై వేంచిసియున్న కనకదుర్గమ్మ అమ్మవారిని శుక్రవారం మహాలక్ష్మిగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు, భవానీలు తరలివచ్చారు. ఆలయ అర్చకులు కార్తికేయ, శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. చోడవరం దుర్గాదేవి ఆలయంలో కరెన్సీనోట్లతో అమ్మవారిని అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శివ కుమార్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు.

కె.కోటపాడు : పాచిలవానిపాలెంలో తలుపులమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం కుంకుమపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ పర్యవేక్షించారు. చౌడువాడ, గుల్లేపల్లిలలో దుర్గాదేవి ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి.

భారీ అన్నసమారాధన

గొలుగొండ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చోద్యం గ్రామంలోని కనకదుర్గ ఆలయం వద్ద శుక్రవారం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. చోద్యంతో పాటు విప్పలపాలెం, గాదంపాలెం, లింగంపేట గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ సుర్ల బాజ్జి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోలుగుంటలో...

రోలుగుంట: మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా రోలుగుంటలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

గొర్రెల పెంపకందారులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న గొర్రెల పెంపకందార్ల సంఘం అధ్యక్షుడు గంటా శ్రీరామ్

అనకాపల్లి టౌన్: బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలను గొర్రెల పెంపకందారులకు మంజూరు చేయాలని గొర్రెల పెంపంకదార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందిన ప్రతి గొర్రెకు రూ.10వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. వర్షాకాలంలో వివిధ వ్యాధులతో గొర్రెలు, మేకలు మృతి చెందుతున్నాయని, వ్యాక్సిన్ ఉచితంగా వేసే ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్బి శ్రీనివాసరావు, రాజశేఖర్, పినబోయిన అప్పారావు యాదవ్, గోకాడ దేముడునాయు, తదితరులు పాల్గొన్నారు.